సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది

బంజారాహిల్స్ రోడ్ నం.12లోని కర్నాటక గల్లీలో ప్రచారం నిర్వహిస్తున్న దానం నాగేందర్

● ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్

ఖైరతాబాద్/ బంజారాహిల్స్, నవంబర్ 22 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే....రేపు జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు నాంది పలుకుతాయని ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ రైల్వే గేటు రోడ్‌లో బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అలాంటి పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత సౌభాగ్యలక్ష్మి పథకంలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడపిల్లకూ నెలకు రూ.3వేలు అందిస్తారని అన్నారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇస్తామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకోవాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఈ నెల 25న జరిగే పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రజా ఆశీర్వాద సభ పోస్టర్లను ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు చౌదరీ యాదయ్య యాదవ్, రాంరెడ్డి, షాబాద్ కృష్ణ, బాక్సర్ అశోక్, చందు, మహేందర్‌బాబు, మహేశ్‌యాదవ్, సురేందర్ ముదిరాజ్, తాండ్ర మేఘన, పి. నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి ఓటెయ్యాలి..

కర్నాటకలో ఉన్న మీ బంధువులను అడిగి అక్కడి కాంగ్రెస్ పాలన ఎలా ఉందని అడిగిన తర్వాతనే బీఆర్ఎస్ పార్టీకి ఓటేయాలంటూ ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ కర్నాటక నుంచి వచ్చి నగరంలో స్థిరపడిన వారిని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బంజారాహిల్స్ డివిజన్ ఎన్‌బీటీనగర్‌లోని కర్నాటక గల్లీలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు దానం నాగేందర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వీధిలో ఉన్న పలువురు కన్నడ మహిళలతో దానం నాగేందర్ ముచ్చటించారు. కర్నాటక నుంచి 20ఏళ్ల క్రితం నగరానికి వచ్చి స్థిరపడ్డామని, తమ వీధిలోనే ముగ్గురికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చాయని, తమ ఓట్లన్నీ బీఆర్ఎస్‌కే వేస్తామని వారు దానం నాగేందర్‌కు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు బతుకు దెరువుకోసం వస్తే కన్నతల్లిలా కడుపులో పెట్టుకుని చూస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ ఫలితాలు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ పాలనను అందరూ ప్రశంస్తుంటే కొంతమంది కాంగ్రెస్ నాయకులు మాత్రం కర్నాటక తరహా పాలన అందిస్తామంటూ మాటలు చెబుతున్నారన్నారు. కర్నాటకలో ఉన్న తమ బంధువులకు ఫోన్లు చేసి అక్కడి కాంగ్రెస్ పాలన ఎలా ఉందో కనుక్కోవాలని సూచించారు. దీనికి స్పందించిన కన్నడ మహిళలు తమ సొంతూర్లలో కరెంట్ సరిగా ఉండదని, మంచినీళ్లు సరిగా ఉండవని బదులిచ్చారు. తామంతా తెలంగాణలో ఆనందంగా ఉన్నామని, తమ బంధువులు కూడా ఇదే విషయాన్ని చెబుతారని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

కొద్ది రోజులు కష్టపడితే మంచి ఫలితాలు

పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

ఖైరతాబాద్, నవంబర్ 22 : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే తన గెలుపునకు నాంది పలుకుతాయి.. కొద్ది రోజులు కష్టపడండి జయంమనల్ని వరిస్తుంది అని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ రైల్వే గేట్ రోడ్‌లో ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని ప్రారంభించిన దానం కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. నాయకులుగా మనం శాశ్వతంగా ఉండాలని కోరుకోవద్దని, మనల్ని నమ్ముకున్న కార్యకర్తలకూ అవకాశాలు కల్పించాలన్నారు. వారిని అడ్డమీద కూలీలుగా వాడుకోవడం తన నైజం కాదని, వాడుకొని వదిలివేయడం తనకు రాదన్నారు. కార్యకర్తగా ఉండి తానీస్తాయికి వచ్చానని గుర్తు చేశారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉండి వారి కష్టసుఖాల్లోనూ పాలుపంచుకుంటానన్నారు. గతంలో తన వద్ద పనిచేసిన ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే తానే సాయం అందించానని గుర్తుచేశారు. ఇక్కడ డబ్బులు ముఖ్యం కాదని, బాధ్యత ఉండాలన్నారు. పీజేఆర్ నిజమైన వారసుడు విష్ణువర్ధన్ రెడ్డి అని, అలాంటి వ్యక్తికి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచి మరొకరిని తెచ్చిపెట్టుకున్నాడని అన్నారు. తనకు అన్ని వేళలా మద్దతుగా నిలిచిందనందుకు విష్ణువర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఈ నెల 25న జరిగే పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రజా ఆశీర్వాద సభ పోస్టర్లను ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు చౌదరీ యాదయ్య యాదవ్, రాంరెడ్డి, షాబాద్ కృష్ణ, బాక్సర్ అశోక్, చందు, మహేందర్ బాబు, మహేశ్ యాదవ్, సురేందర్ ముదిరాజ్, తాండ్ర మేఘన, పి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి టీడీపీ నేతలు

బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నాయకులతో దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 22: తెలంగాణ ప్రజలకు ఇంటిపార్టీలా మారిన బీఆర్ఎస్‌ను తప్ప వేరే పార్టీలకు ఓటేస్తే ప్రజలు తీవ్రంగా నష్టపోవడం ఖాయమని ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. వెంకటేశ్వర కాలనీ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు సయ్యద్ ముజ్జుతోపాటు పలువురు కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీని ప్రజలంతా తమ ఇంటి పార్టీగా భావిస్తున్నారని, అందుకే ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు. నాయకులు బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని పేర్కొన్నారు.

ప్రపంచ చాంపియన్స్‌గా ట్విన్స్

ప్రపంచ చాంపియన్ ట్రోఫీలతో అమయ, అనయ్ అగర్వాల్

ఖైరతాబాద్, నవంబర్ 22 : నగరానికి చెందిన ట్విన్స్ అమయ, అనయ్ అగర్వాల్ అరుదైన రికార్డును సాధించారు. ప్రపంచ అండర్ 8 చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో వరల్డ్ చాంపియన్‌గా నిలిచారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోచ్ లు చైతన్య, స్రవంతి, సందీప్ నాయుడు వివరాలు వెల్లడించారు. ఇటీవల ఈజిప్టు, సెర్బియాలో జరిగిన అండర్ 8 ప్రపంచ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో అత్యధిక రేటింగ్ సాధించి ప్రపంచ చాంపియన్లుగా నిలిచారని అన్నారు.

డిసెంబర్ 15 నుంచి మహిళా సహకార సమ్మేళనం

ఖైరతాబాద్, నవంబర్ 22 : సహకార భారతీ ఆధ్వర్యంలో డిసెంబర్ 15, 16 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం, చేగూర్ గ్రామంలోని కన్హా శాంతివనంలో అఖిల భారత తృతీయ మహిళా సహకార సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు దీనానాథ్ ఠాగూర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సమ్మేళనానికి సంబంధించిన బ్రోచర్లను తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కుమారస్వామి, వినయ్ కటియార్, రమాదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో దేశం నలుమూలల నుంచి 3వేల మంది మహిళా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. వివిధ సహకార రంగాలకు చెందిన మహిళా ప్రముఖులు హాజరై ఉత్పత్తి, మార్కెటింగ్‌లో తమ అనుభవాలను పంచుకుంటారని తెలిపారు.

పరామర్శ..

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్ చార్జి సర్పరాజ్‌ను బుధవారం దత్తానగర్‌లోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ వెళ్లి పరామర్శించారు.సర్పరాజ్ ఆరోగ్యంతో పాటు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.ఏలాంటి ఇబ్బంది ఉన్న తన దృష్టికి తీసుకురా వాలని, అన్ని విధాలుగా అండగా ఉంటానని దానం నాగేందర్ భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండి త్వరగా కోలుకోవాలని దానం నాగేందర్ ఆకాంక్షించారు.

– హిమాయత్‌నగర్, నవంబర్22

దానం నాగేందర్‌కు మద్దతుగా ముమ్మర ప్రచారం

షౌకత్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, నవంబర్ 22: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం కోసం పారీ కార్యకర్తనుంచి మేయర్ దాకా సమిష్టిగా కృషి చేస్తున్నారు. బుధవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. జవహర్ కాలనీలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని షౌకత్‌నగర్‌లో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఇంటింటికీ వెళ్లి పేదలకు ప్రయోజనం కలిగిస్తున్న బీఆర్ఎస్ పార్టీనే మరోసారి గెలిపించాలని కోరారు. ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని బస్తీలు. కాలనీలలో డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.